## బ్యాంకుల్లో పొదుపు ఖాతా కలిగి ఉండాలి

ఉట్నూర్, అక్టోబర్ 27 : 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తి బ్యాంకుల్లో పొదుపు ఖాతాను తీసుకోవాలని నాబార్డు ఎఫ్ఎల్‌సీ లోక రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గోండుగూడ(జీ) గ్రామంలో సహకార బ్యాంకు ఉట్నూర్ శాఖ, నాబార్డు ఆధ్వర్యంలో డిజిటల్ లావాదేవీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం బ్యాంకు రుణాలు పొందే విధానం, మరలా తిరిగి చెల్లింపు, రైతులకు వచ్చిన ఆదాయం బ్యాంకులలో జమ, ప్రధాన మంత్రి జీవన జ్యోతి, సురక్ష భీమా పథకాలపై అవగాహన కల్పించారు. నేటి కాలంలో డిజిటల్ లావాదేవీలు, సైబర్ నేరాల గురించి వివరించారు. కార్యక్రమంలో సహకార బ్యాంక్ ఫీల్డ్ అధికారి రాజు, సర్పంచ్ ఆత్రం రాహుల్, గ్రామ పటేల్, ఫాక్స్ సెక్రటరీ అశోక్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సోయా, మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో గణేశ్

ఉట్నూర్, అక్టోబర్ 27 : మండలంలోని హస్నాపూర్ సబ్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సోయా, మక్కల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఉట్నూర్ వ్యవసాయశాఖ అధికారి రాథోడ్ గణేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటల్ సోయా పంటకు మద్దతు ధర రూ.4600, మక్కకు రూ.2090 ఉన్నాయన్నారు. రైతులు పట్టాపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ తీసుకొని వచ్చి పంటను విక్రయించాలని సూచించారు. అలాగే ఉట్నూర్ సొసైటీ కార్యాలయంలో రెండు రకాల శనగ విత్తనాలు జేజీ-11 రకం శనగ 25 కిలోల సంచి రూ.1875, జేఏకేఎల్ 9218 రకం ధర రూ.1875 ఉన్నాయన్నారు. కావాల్సిన వారు పట్టా పుస్తకం, ఆధార్ జిరాక్స్‌తో ఫ్యాక్స్ కార్యాలయంలో అందజేసి తీసుకోవాలని సూచించారు.

# రైతు వ్యతిరేక విధానాల పార్టీ కాంగ్రెస్



ఆదిలాబాద్ రూరల్: రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 27 : రైతు వ్యతిరేక విధానాల పార్టీ కాంగ్రెస్ అని బీఆర్ఎస్ నాయకుడు నల్ల రాజేశ్వర్ అన్నారు. రైతుబంధు కింద రైతులకు అందించే పెట్టుబడి సాయాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌ను ఫిర్యాదు చేయడాన్ని నిరిసిస్తూ శుక్రవారం మావలలో అన్నదాతలు, బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు నల్ల రాజేశ్వర్ మాట్లాడుతూ రైతులపై కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొత్త పథకాలు అమలు చేయడం లేదని, ఇది వరకు అందజేసిన సాయాన్ని యాసంగిలో ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటే కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో రైతులే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు ఏవన్, గోవర్ధన్ రెడ్డి, గోవర్ధన్, శ్రీనివాస్ యాదవ్, అజీమ్‌ఖాన్, సుధీర్, అభిమాన్, సంతోష్, మోసిన్, సునీల్, గంగన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జైనథ్: భోరజ్‌లో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**భోరజ్‌లో..**

జైనథ్, అక్టోబర్ 27 : రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం భోరజ్‌లో బీఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మార్సెట్టి గోవర్ధన్ మాట్లాడుతూ రైతు వ్యతిరేకి రేవంత్ రెడ్డి నైజం మరోసారి బయటపడిందన్నారు. రైతుబంధును ఆపి వేయాలన్న కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరగనియమవద్దన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు వెంకట్ రెడ్డి, రైతు బంధు సమితి మండల కన్వీనర్ లింగారెడ్డి, నాయకులు నర్సింగ్‌రావ్, కల్చాప్ రెడ్డి పాల్గొన్నారు.

## పేదలకు భరోసా కల్పించేలా మ్యానిఫెస్టో



మ్యానిఫెస్టో పథకాలు వివరిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 27 : పేదలకు భరోసా కల్పించేలా సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోను రూపొందించారని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని రణదివేనగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల తీరును వివరించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కోవ రవి, నాయకులు పర్వీన్ ఫెరోజ్, నంద, గాజు రాథోడ్, ఇబ్బు, నవీన్, జబ్బర్, సంజయ్, సునీల్, శ్రీధర్ పాల్గొన్నారు.

## హరీశ్‌రావు సభను విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి, అక్టోబర్ 27: ఉట్నూర్‌లో శనివారం నిర్వహించే మంత్రి హరీశ్‌రావు సభను విజయవంతం చేయాలని ఇంద్రవెల్లి పీఏసీఎస్ చైర్మన్ మారుతి పటేల్ డోంగ్రే పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉట్నూర్‌లోని ఎంపీడీవో మైదానంలో ఉదయం 10 గంటలకు సభ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

## బోథ్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బోథ్, అక్టోబర్ 27: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బోథ్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో 24 గంటలు పని చేసేవిధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌వో చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఎవరైన ఫిర్యాదులు, సమాచారం గాని తెలుసుకోవాలనుకుంటే 08751-293900 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఆటో బోల్తా పడి మహిళకు గాయాలు

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 27 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోహార గ్రామం వద్ద శుక్రవారం ప్రమాదశాత్తు ఆటో బోల్తా పడిన ఘటనలో మహిళకు గాయాలయ్యాయి. ఖండాల నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న వృద్ధ మహిళతోపాటు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మహిళను చికిత్స నిమిత్తం స్థానికులు రిమ్స్‌కు తరలించారు.

## ఉత్తమ్‌కుమార్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నార్నూర్, అక్టోబర్ 27 : రైతు వ్యతిరేక కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని గాదిగూడ వైస్ ఎంపీపీ మర్సివనే యోగేశ్, మండలాధ్యక్షుడు పుసం బాదిరావ్ అన్నారు. శుక్రవారం గాదిగూడలోని కుమ్రం భీం చౌరస్తా వద్ద ఉత్తమ్ కుమార్ రెడ్డి దిష్టబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టె రైతన్నల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తుంటే, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉత్తమ్‌రెడ్డి రైతు బంధు నిలిపివేయాలని చెప్పడం శోచనీయమన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగ్గినబుద్ధి ప్రజలే చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాథోడ్ కిరణ్, సర్పంచ్‌లు జంగు, భరత్, బీఆర్ఎస్ నాయకులు కొడప జాకు, దేవ్‌రావ్ పాల్గొన్నారు.



ఉత్తమ్‌కుమార్ రెడ్డి దిష్టబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

# ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయద్దు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పోలీసు కుంటుంబ సభ్యులు

ఎదులాపురం, అక్టోబర్ 27 : పోలీసు సిబ్బంది 24 గంటల పాటు విధులు నిర్వహిస్తూ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయవద్దని ఆదిలాబాద్ ఎస్పీ డీ ఉదయ్ కుమార్ రెడ్డి సూచించారు. యశోధ హాస్పిటల్ సహకారంతో పోలీసు కుటుంబాలకు కార్డియాలజీ, గైనకాలజీ, పల్మనాలజీ, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్ విభాగాల వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అలాగే శరత్‌మాక్స్ విజన్ హాస్పిటల్ వారు కంటి పరీక్షలు చేశారు. అదనపు ఎస్పీ సీ సమైజన్‌రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎస్పీకి పోలీస్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. 300 మంది సిబ్బంది కుటుంబ సభ్యులు పరీక్షలు చేయించుకున్నారు. డీఎస్పీ పోతారం శ్రీనివాస్, అసోసియేసన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆర్ఐ సీఐలు మురళి, నవీన్ కుమార్, కార్తిక్ ఉన్నారు.

# ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్

బేల,అక్టోబర్ 27 : ఆదిలాబాద్‌లో శనివారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్‌లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు మంత్రి హరీశ్‌రావు వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బేల మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యాక్షుడు గంభీర్‌ఠాక్రే, మండలాధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, నాయకులు జక్కుల మధుకర్, సతీశ్‌పవార్, వట్టిపెళ్లి ఇంద్రశేఖర్, తన్వీర్‌ఖాన్, బాలేరావ్ మధుకర్, విశాల్ , ఖోడే విపిన్ పాల్గొన్నారు.